# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఉద్యోగుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.**

**2. పర్యాటకాంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.**

**3. ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం అందేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా పోషకాహారం అందిస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.**

==========================

ఉద్యోగుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విశాఖపట్నంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, ఉద్యోగులకు అందాల్సిన హక్కులు, సౌకర్యాలు, వారి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉద్యోగులకు మరింత సౌలభ్యం కల్పించే విధానాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ అన్నారు. నంద్యాలలోని ఎస్ఆర్‌బీసీ కాలనీ వద్ద నిర్వహించిన టిడ్కో గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొని.. ఇళ్ల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఉచితంగా ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. గృహ సముదాయాలను టౌన్‌షిప్ తరహాలో గేటెడ్ కమ్యూనిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని మిగిలిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, డిసెంబర్ 2026 నాటికి లబ్ధిదారులందరికీ ఇళ్లు అందజేస్తామని చెప్పారు.

---------------------------

పర్యాటకాంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో మంత్రి నిన్న పాల్గొని మాట్లాడుతూ, పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడంతో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. భారతదేశంలో ఉన్న వైవిధ్య ప్రదేశాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని మంత్రి దుర్గేష్ పేర్కొంటూ,

వాయిస్ ..27..సెకన్లు

--------------------------

పేదలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు, నాణ్యమైన సన్న బియ్యం అందేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 85 శాతం మంది ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. దేశంలోనే పేదలకు సన్నబియ్యం పంపిణీ ఒక వినూత్న పథకమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ పోషణ ప్లస్ పథకం ద్వారా పోషకాహారం అందిస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులు, సహాయకులకు యూనిఫాం చీరలు, అంగన్వాడీ చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఆరు కీలక సేవలను అందిస్తోందని తెలిపారు. బాల సంజీవని పథకం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు..

--------------------------

తెలంగాణలోని మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎన్నికల అధికారులు ఈరోజు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ప్రస్తుత పదవీకాలం 2027 మార్చితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నవంబర్ ఒకటో తేదీ నాటికి డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు పూర్తయిన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఓటరు నమోదుకు ఫారం-18ను నింపాల్సి ఉంటుందని పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపించవచ్చని సూచించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారక వెబ్‌సైట్ ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్', జాతీయ స్థాయి 'సరస్ మేళా' నిర్వహించనున్నట్లు పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, అక్టోబర్ 8 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. విజయవాడకు

సాంస్కృతిక, కళల నగరంగా ఉన్న గుర్తింపును మరింత బలోపేతం చేసేలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శివనాథ్ వివరిస్తూ...

వాయిస్..25.. సెకన్లు

---------------------------

దేశ సమగ్ర వికాసానికి, ప్రజల్లో స్ఫూర్తిని నింపేందుకు 'మన్ కీ బాత్' కార్యక్రమం దోహదపడుతోందని అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా పెదపర్తిలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆయన నిన్న వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ... సమాజానికి సేవలందిస్తున్న ప్రజల కృషిని గుర్తించి, వారి సేవలను ప్రజలకు పరిచయం చేయడంలో 'మన్ కీ బాత్' కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మహిళా క్రికెట్‌లో ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ నిన్న ఘనంగా ముగిసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో జరిగిన ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి గోల్డెన్ ఈగల్స్ 20 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 97 పరుగుల విజయ లక్ష్యాన్ని రాయలసీమ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి, నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

---------------------------

ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6లో ఎన్నికల సంఘం మార్పులు చేసిందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-ఎస్.ఐ.ఆర్, ఫారం-6 అంశాలపై విజయవాడలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్, ఫారం-6 అంశాలపై అవగాహన కల్పించేందుకు వందకు పైగా శిక్షణా తరగతులు నిర్వహించామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఈరోజు, రేపు ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================